
సాక్షి తిరుపతి

గురువారం । 22 । ఫిబ్రవరి । 2024



రీపోలింగ్‌కు ఆస్కారం వద్దు

రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్ ఆదేశించారు. - 8లో



విజయవంతం చేయండి

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దామని ఆలయ చైర్మన్, ఈఓ కోరారు. - 8లో



సౌకర్యాలు కల్పించండి

విద్యార్థులకు వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి, వారి ఉన్నతికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. - 8లో

న్యూస్‌రీల్

అద్దె బస్సులకు టెండర్ల ఆహ్వానం

తిరుపతి అర్బన్: ఆర్టీసీ జిల్లాలోని ఆరు డిపోల్లో 32 అద్దె బస్సులకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీపీటీఓ చెంగల్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గూడూరు, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, వెంకటగిరి డిపోల పరిధిలో అద్దెకు బస్సులను ఆర్టీసీ తీసుకోనుందని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు బుధవారం నుంచి మార్చి 6వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు టెండర్లు వేయాలని కోరారు. పూర్తి సమాచారం కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్‌ఆర్టీసీ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరచినట్లు వివరించారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 62,304 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 20,261 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.61 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం అవుతోంది.

ఎన్నికల్లో నోడల్ అధికారులు కీలకం



మాట్లాడుతున్న కలెక్టర్ జి.లక్ష్మీశ

తిరుపతి అర్బన్: ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఆయన బుధవారం డీఆర్వో పెంచల కిషోర్‌తో కలిసి నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ఎన్నికల సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. తిరుపతి కొత్త జిల్లాగా ఏర్పడిన తర్వాత తొలి సార్వత్రిక ఎన్నికలు నిర్వహిస్తున్న క్రమంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారి ఇచ్చే సూచనలు ఎప్పటికప్పుడు ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. గతంలో ఎన్నిసార్లు ఎన్నికల విధులు నిర్వహించినా ప్రతిసారీ కొత్తగానే ఉంటాయని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళికి సంబంధించిన బుక్‌ను పూర్తిగా చదువుకొని అవగాహన చేసుకోవాలని చెప్పారు. సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా భద్రపరచుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ నోడల్ ఆఫీసర్లు వారికి కేటాయించిన సహాయక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

25న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

- 1 నుంచి కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని వేడుకగా నిర్వహించనున్నారు. మార్చి 1 నుంచి 10వ తేదీ వరకు కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. 25న ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయం, పూజ సామగ్రిని శుద్ధి చేసి సుగంధ ద్రవ్యాలతో ప్రోక్షణం చేస్తారు. ఈ కారణంగా ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే సర్వదర్శనం ఉంటుంది.

బ్రహ్మోత్సవాల్లో వాహన సేవలు

కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి1వ తేదీ ఉదయం ధ్వజారోహణం, రాత్రి హంస వాహనం నిర్వహిస్తారు. 2న సూర్యప్రభ, చంద్రప్రభ, 3న భూత వాహనం, సింహ వాహనం, 4న మకర వాహనం, శేష వాహనం, 5న తిరుచ్చి ఉత్సవం, అధికార నంది వాహన సేవలు జరుగనున్నాయి. 6న వ్యాఘ్ర వాహనం, గజవాహనం, 7న కల్పవృక్ష వాహనం, అశ్వ వాహనం, 8న పురుషామృగ వాహనం, సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి తిరుచ్చి వాహన సేవలు ఉంటాయి. 10న ఉదయం త్రిశూల స్నానం, సాయంత్రం ధ్వజావరోహణం, రాత్రి రావణాసుర వాహన సేవతో స్వామివారి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

దుష్ప్రచారానికి దేశదిమ్మరులు

గోబెల్స్ ప్రచారంలో ఆరితేరిన తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు సంక్షేమ ప్రభుత్వంపై నిత్యం విషం చిమ్మేందుకు అడ్డదారిలో రంగం సిద్ధం చేసుకున్నారు. కేవలం సంక్షేమ ప్రభుత్వంపై అందుకోసం క్రమంలో సరికొత్త పంథాలను అనుసరిస్తున్నారు. ఇప్పటికే తన అను'కుల' ఎల్లో మీడియా ద్వారా విస్తృతంగా అబద్ధాలు వల్లె వేస్తున్న ఆయన అది ఏమాత్రం ప్రభావం చూపించడం లేదని భావించి రకరకాల విన్యాసాలకు తెరదీస్తున్నారు.

- సంక్షేమ ప్రభుత్వంపై బురద జల్లేందుకు తెలుగుదేశం పన్నాగం
- ఒక్కో నియోజకవర్గానికి ప్రత్యేక బృందాల నియామకం
- ఒక్కొక్కరికి రోజుకు రూ.వెయ్యి నుంచి రూ.1,500 కూలి
- పక్క రాష్ట్రాల నుంచి కూడా ప'నోళ్లు' దిగుమతి
- విషప్రచారంతో పాటు విధ్వంసాలకూ కుట్ర!
- సోషల్ మీడియాలో సైతం టీడీపీ శ్రేణుల కుయుక్తులు
- ఖర్చుకు వెనుకాడకుండా భారీగా నిధుల సేకరణ



సాక్షి, తిరుపతి: ప్రజల విశేష జనాదరణ కలిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా ఊరూరా దుష్ప్రచారానికి కుట్రపన్నారు. దీనికోసం రాష్ట్ర వ్యాప్తంగా కూలీలను నియమించుకుంటున్నారు. ఒక్కోనియోజకవర్గానికి ప్రత్యేక బృందాలను రిక్రూట్ చేసుకుంటున్నారు. ఈ పనికి స్థానికులు ముందుకు రాకపోతే పక్క రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. వీరికి రోజుకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు చెల్లిస్తున్నారు. దీనికోసం భారీగా నిధులు సమీకరించుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా నారాయణ విద్యాసంస్థల విద్యార్థులతో చంద్రబాబు అసత్య ప్రచారం చేయిస్తుండడం గమనార్హం.

అధికార పార్టీని దెబ్బతీసేందుకు ఆపసోపాలు..

ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీలో వణుకు మొదలైంది. వైఎస్సార్‌సీపీ చేపడుతున్న 'సిద్ధం' ఎన్నికల శంఖారావ సభలకు వస్తున్న ఆదరణ చూసి ఉలిక్కిపడుతోంది. ఎలాగైనా అధికార పార్టీని దెబ్బతీయాలని కుట్రలు పన్నుతోంది. గతంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వెళ్లిన పాతకాపులను కలిసి తిరిగి రావాలని ప్రాధేయపడుతోంది. వారి నుంచి స్పందన రాకపోవడంతో ప్రజల్లో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై వ్యతిరేకత ఉందని చూపేందుకు ఆపసోపాలు పడుతోంది.

ప్రతి జిల్లాకు సోషల్ మీడియా దుష్టకూటమి..

వీరు కాకుండా టీడీపీలో అత్యంత నమ్మకంగా ఉన్న పార్టీ శ్రేణులతో ప్రతి జిల్లాలో ప్రత్యేక బృందంగా ఏర్పాటు చేశారు. వీరి ఆధార్ కార్డులు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు సేకరించారు. రోజూ ప్రభుత్వంపై వ్యతిరేక, టీడీపీ అనుకూల నినాదాలను వీరు సోషల్ మీడియాలో వైరల్ చేయాలి. వాటిని పార్టీ నాయకులు ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్ట్రాగాం, యూట్యూబ్‌లో తిరిగి పోస్ట్ చేసేలా పన్నాగం పన్నారు. బురద చల్లే బ్యాచ్ ఖర్చుల కోసం టీడీపీ పెద్దఎత్తున నిధులు సేకరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నిధులను ఎన్‌ఆర్‌ఐలు, అమరావతికి చెందిన భూస్వాములు, కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు, కార్పొరేట్ ఆస్పత్రుల నుంచి సేమీకరించినట్లు సమాచారం.

ఊరూరా తిరిగి బురద చల్లడమే పని !

ఒక్కో నియోజకవర్గానికి ప్రత్యేకంగా కూలీలను నియమించుకున్న టీడీపీ వారికి ఫీల్డ్ ఫోర్స్ అని పేరుపెట్టింది. వీరిపైన బ్రాంచ్ మేనేజర్, ఇద్దరు టీం మేనేజర్లు, నలుగురు గ్రూప్ కో-ఆర్డినేటర్లను నియమించింది. వీరంతా సైకిల్ పార్టీకి చెందిన వారే. వారు చెప్పినట్టు ఫీల్డ్‌ఫోర్స్ పనిచేయాలి. వీరు ముందుగా ఊరూరా తిరిగి సమాచారాన్ని సేకరించి రాష్ట్ర టీడీపీ కార్యాలయానికి పంపుతున్నారు. దాని ఆధారంగా క్షేత్రస్థాయిలో ఎలా దుష్ప్రచారం చేయాలో ఎప్పటికప్పుడు ఫీల్డ్‌ఫోర్స్‌కు సూచనలు, సలహాలు అందుతాయి. దీనికోసం రాష్ట్ర టీడీపీ కార్యాలయంలో ప్రత్యేకంగా ఓ బృందం అందుబాటులో ఉంటుంది. వీరు టీం మేనేజర్లకు ఇటీవల ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. బృందాలుగా ఏర్పాటైన ఫీల్డ్‌ఫోర్స్ జన సంచారం ఉన్న ప్రాంతాలకు చేరుకుని అక్కడ పార్టీ అధిష్టానం నుంచి వచ్చిన ఆదేశానుసారం డ్రామా స్టార్ట్ చేస్తుంది. అది విష ప్రచారమైనా కావొచ్చు. విధ్వంసమైనా కావచ్చు. అది పైనుంచి వచ్చే ఆదేశాల మేరకు ఉంటుంది.

మరో 2వేల మంది టీడీపీ సానుభూతిపరులు

ఈ రెండు వందల మందే కాకుండా టీడీపీలో నమ్మకంగా ఉన్న పార్టీ శ్రేణులను జిల్లాకు రెండు వేల మందిని ప్రత్యేక బృందంగా ఏర్పాటు చేస్తున్నారు. వీరి ఆధార్ కార్డులు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు సేకరించారు. ప్రతి రోజూ ఒక్కో కార్యకర్త పేరుతో రోజూ నాలుగు సార్లు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తారు. వాటిని పార్టీ నాయకులు ఫేజ్ బుక్, ట్విట్టర్, ఇన్‌స్ట్రాగాం, యూట్యూబ్‌లో పోస్ట్ చేసి వైరల్ చేస్తారు.

కుప్పంలో ప్రారంభం..

కుప్పం నియోజకవర్గంలో అన్నికులాల వారిని కలసి తాము నియమించిన బృందాలు రాష్ట్రప్రభుత్వంపై దుష్ప్రచారం చేయించేందుకు మొదలుపెట్టారు. ప్రతి కులానికి పదిమంది సభ్యులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరికి ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి ఎన్నికలు ముగిసేంత వరకు ఆయా సామాజిక వర్గాల వారితో టచ్‌లో ఉండే విధంగా ప్లాన్ చేశారు. ఇందుకోసం టీడీపీ ఫోరం పేరిట బెంగళూరు చెందిన 200మందిని కుప్పానికి తీసుకొచ్చారు. వీరు ప్రతి బూత్‌లో పర్యటించి ప్రభుత్వంపై బురద చల్లేందుకు దుష్ప్రచారం చేస్తున్నారు.

తెలుగుగంగ నుంచి నీటి విడుదల

- ఏడు నియోజవర్గాల ప్రజలకు తీరనున్న దాహార్తి
- నెల్లూరు తెలుగుగంగ ఇన్‌చార్జ్ ఎస్‌ఈఈ రాధాకృష్ణమూర్తి



మాట్లాడుతున్న ఎస్‌ఈఈ రాధాకృష్ణమూర్తి

డక్కిలి: ఉమ్మడి నెల్లూరు జిల్లా, తిరుపతి జిల్లాల ప్రజలకు వేసవిలో దాహార్తిని తీర్చేందుకు తెలుగుగంగ నుంచి 1.784 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు నెల్లూరు జిల్లా తెలుగుగంగ ఇన్‌చార్జ్ ఎస్‌ఈఈ రాధాకృష్ణమూర్తి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతేడాది భారీ వర్షాలు కురిసినప్పటికీ కొద్ది రోజుల్లోనే చెరువులు ఎండిపోవడంతో భూగర్భజలాలు అడుగంటాయన్నారు. దీంతో వేసవిలో నీటి తీవ్రత తలెత్తకుండా ముందే జాగ్రత్త పడిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీఎం రెండు జిల్లాల ప్రజల దాహార్తిని తీర్చేలా నీటిని విడుదల చేయాలని తెలుగుగంగ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కండలేరు జలాశయం నుంచి ప్రస్తుతానికి 1.784 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్‌ఈఈ తెలిపారు. దీంతో తిరుపతి, సత్యవేడు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి, సర్వేపల్లి నియోజకవర్గాల్లో తాగునీటి సమస్య తీరనుంది. అదేవిధంగా స్వర్ణముఖి పరివాహక ప్రాంతాల్లో ఉన్న మండలాలకు, వాకాడు సమీపంలో ఉన్న బ్యారేజీ వరకు నీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు. పైనుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే నీటిని విడుదల చేస్తామని ఎస్‌ఈఈ తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో ఉన్న 2.26 టీఎంసీల నీటిని తాగునీటి కోసం వినియోగిస్తామన్నారు.

గోవిందుడి జల విహారం

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి వారి తెప్పోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి వారు తెప్పలపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఇందులో భాగంగా ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం చేపట్టారు. సాయంత్రం 6.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్దకు వేంచేపు చేసి తెప్పలపై కొలువుదీర్చి హారతులు సమర్పించారు. తెప్పలపై కొలువైన స్వామి, అమ్మవార్లు పుష్కరిణిలో ఏడు చుట్లు విహరించి భక్తులకు కనువిందు చేశారు. అనంతరం ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన భజనలు, హరికథ, సంగీత కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తిరుమల చిన్నజీయంగార్ స్వామి, జేఈవో వీరబ్రహ్మం, ఎఫ్‌ఏ అండ్ సీఏవో బాలాజీ, ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునిక్రిష్ణారెడ్డి, సూపరింటెండెంట్ మోహన్ రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ పాల్గొన్నారు.



తెప్పపై విహరిస్తూ భక్తులను కనువిందు చేస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

5 నుంచి తలకోనలో మహా శివరాత్రి ఉత్సవాలు

భాకరాపేట : వచ్చే నెల 5 నుంచి 9 వరకు తలకోన మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు ట్రస్టుబోర్డు చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం తలకోన సిద్దేశ్వర స్వామి కల్యాణ మండపంలో ట్రస్టు సభ్యులు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏటా భక్తులు సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆ దిశగా ఏర్పాట్లు చేయాలన్నారు. 8న మహా శివరాత్రి, మధ్యాహ్నం కల్యాణోత్సవం, రాత్రి జాగరణ, 9న సిద్ధపూజ, 15న మారు పొంగళ్లు, రాత్రి జాగరణ, 16న మారు పొంగళ్లు, సిద్ధపూజ చేస్తామన్నారు. ఈఓ జయకుమార్, ఎంపీపీ ఊటూకూరు రెడ్డెమ్మ, తహసీల్దార్ బాలకిషన్, ఎంపీడీఓ మధుసూదన్‌రావు, మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చెందల్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం



కలెక్టర్ లక్ష్మీశ నుంచి బహుమతి అందుకుంటున్న బ్యాడ్మింటన్ క్రీడాకారులు

- గ్రామస్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించాలి
- తిరుపతి జిల్లాకు ద్వితీయ స్థానం రావడం ఆనందంగా ఉంది
- కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీల్లో రెండోస్థానం
- బ్యాడ్మింటన్ క్రీడాకారులకు రూ.3 లక్షలు, కబడ్డీ క్రీడాకారులకు ఒక్కొక్కరికి రూ.25 వేలు ఖాతాల్లో జమ
- బ్యాడ్మింటన్‌లో నాయుడుపేట, కబడ్డీలో నాగలాపురం ఆటగాళ్ల సత్తా
- జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్: గ్రామస్థాయి నుంచే క్రీడాకారులను మరింత ప్రోత్సహించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఆడుదాం- ఆంధ్ర పోటీల్లో కబడ్డీ, బ్యాడ్మింటన్ విభాగాల్లో తిరుపతి జిల్లా రాష్ట్రంలో రెండో బహుమతిని సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈనెల 9వ తేదీ నుంచి 15 వరకు ఆడుదాం-ఆంధ్ర ఫైనల్ పోటీలను విశాఖపట్నంలో జరిగిన కబడ్డీ, బ్యాడ్మింటన్ విజేతలైన పురుషుల విభాగం క్రీడాకారులను బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ చేతుల మీదుగా ట్రోఫీ, సిల్వర్ మెడల్స్, ప్రశంసా పత్రాలను క్రీడాకారులకు అందజేసి శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రతిభ ఉన్న క్రీడాకారులు ఉంటారని ఆడుదాం-ఆంధ్ర ద్వారా రుజువు చేశారని వెల్లడించారు. పీఈటీలు, పీడీలు రానున్న రోజుల్లో ఇలాంటి ప్రతిభ ఉండే క్రీడాకారులను గుర్తించి రాష్ట్రస్థాయిలోనే కాకుండా దేశ, ప్రపంచస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి పునాదాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్, జిల్లా విద్యాశాఖ అధికారి వి.శేఖర్, కోచ్‌లు, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో ద్వితీయ స్థానం

బ్యాడ్మింటన్ విజేతలైన సీహెచ్ సాయి సుధీర్, నాగసాయికి ఒక్కొక్కరికి రూ.50వేలు చొప్పున నగదు బహుమతిని వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. వీరు నాయుడుపేట పట్టణంలోని బేరివీధి సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయి బ్యాడ్మింటన్‌లో ద్వితీయస్థానం కైవసం చేసుకున్నారు. తమకు రాష్ట్రస్థాయి అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పించడంతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

నాగలాపురం కబడ్డీ జట్టు సెకండ్ ప్లేస్..

మరోవైపు కబడ్డీ జట్టుకు సంబంధించి నాగలాపురం సచివాలయానికి చెందిన సుమన్, అరుణ్ కుమార్, సతీష్, నరసింహ, తమిళరసన్, చిన్నముత్తు, అభిషేకం, శ్రీనివాసన్, దేవేంద్రన్, డిల్లీబాబు, జయశక్తి(11మందితో కూడిన) జట్టు రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం దక్కించుకుంది. అందులో ఒక్కో ఆటగాడికి రూ.25 వేలు చొప్పున వారి ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేసింది. వీరితోపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చి రాష్ట్రస్థాయికి చేరుకునేలా ప్రోత్సహించిన క్రీడాకారులు ఏ.సుమన్, సతీష్‌ను కలెక్టర్ అభినందించారు. వీరిని ప్రోసంస్థ ప్రతినిధులు ప్రో కబడ్డీలో స్థానం కల్పిస్తున్నట్లు ప్రకటించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజేతలైన కబడ్డీ క్రీడాకారులు మాట్లాడుతూ 'మా జీవితంలో రాష్ట్రస్థాయి అవార్డు అందుకుంటామని అనుకోలేదు.. పల్లెప్రాంతాల్లో కబడ్డీ ఆడుకుంటున్న మమ్మల్ని ఆడుదాం-ఆంధ్ర పేరుతో రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా మార్చిన ఈ ప్రభుత్వానికి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం' అని క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేశారు.

సంక్షేమ సారథి జగన్‌మోహన్‌రెడ్డి

- అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాయి
- సచివాలయ వ్యవస్థ గ్రామ స్వరాజ్యానికి పునాది
- ఎమ్మెల్యే చెవిరెడ్డి చొరవతో ప్రతి పల్లెలో అభివృద్ధి పనులు
- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్: దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కోట్లాది మంది లబ్ధిదారులకు నేరుగా వారి అకౌంట్లలోకే నిధులను జమ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా చిరకాలం గుర్తుండిపోతారని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. బుధవారం తిరుపతి రూరల్ మండలంలోని సీమల్లవరం, పెరుమాళ్లపల్లి, గొల్లపల్లి, రామానుజపల్లి, దుర్గసముద్రం పంచాయతీలలో నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతిగ్రామంలో మహిళలు హారతులు పట్టి ఆహ్వానించారు. పార్టీ శ్రేణులు పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ఆయా పంచాయతీలలో ఆయన పార్టీ జెండాలు, సచివాయాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల జాబితా బోర్డును ఆవిష్కరించారు. అలాగే మహిళలకు వైఎస్సార్ చేయూత చెక్కులను మహిళలకు అందజేశారు.

సీఎం జగనన్న చెప్పాడంటే.. చేస్తాడంతే

ఈ సందర్భంగా మోహిత్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి మాట ఇస్తే చేస్తారన్నారు. గత ప్రభుత్వంలో టీడీపీ నేతలు ఇచ్చిన హామీలను ఏ మేరకు నెరవేర్చారో అందరికీ తెలుసన్నారు. చంద్రగిరిలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో అభివృద్ధి చేశామన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు గ్రామ స్వరాజ్యానికి పునాదిగా నిలుస్తోందన్నారు.

పలు ప్రారంభోత్సవాలు

సీమల్లవరంలో సచివాలయ భవనం, వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాన్ని, జగనన్న సమావేశ మందిరం, పెరుమాళ్లపల్లి, గొల్లపల్లిలో సచివాలయ భవనాలు, ఆర్బీకేని మోహిత్ రెడ్డి ప్రారంభించారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా..

సీమల్లవరం పంచాయతీలో రూ.11.22 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా, అత్యధికంగా 45 సిమెంట్ రోడ్లకు రూ.2.75 కోట్లు ఖర్చు చేసినట్లు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. అలాగే రూ.28.33 కోట్ల సంక్షేమ నిధులు లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. తిరుపతి రూరల్ ఎంపీపీ యశోద, వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మునీశ్వర రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



మహిళలకు ఆసరా చెక్కులను పంపిణీ చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



సభలకు భారీగా హాజరైన గ్రామస్తులు

క్లుప్తంగా

వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించండి

తిరుపతి అర్బన్: విద్యార్థుల వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమశాఖ, బీసీ కార్పొరేషన్, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమం శాఖ, ఎస్సీ కార్పొరేషన్, జిల్లా మైనారిటీ సంక్షేమం శాఖ, గురుకుల పాఠశాలల శాఖలు అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు, వసతి గృహాల్లో మౌలిక వసతులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వసతి గృహాల్లో చదువుతున్న పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా సంక్షేమ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. అర్హులైన అందరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి భాస్కర్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ అధికారి శ్రీదేవి, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి శ్రీనివాసులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మేఘనాథ్, జిల్లా మైనారిటీ సంక్షేమం శాఖ అధికారి చిన్నారెడ్డి, జిల్లా గురుకుల పాఠశాలల అధికారి జయభారతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సర్వీసుల తనిఖీ

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరిధిలోని విద్యుత్ సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. ఇందులో మొత్తం 3,676 సర్వీసులను తనిఖీ చేయగా తిరుపతి ఆపరేషన్ 99, తిరుపతి రూరల్ 61, పుత్తూరు 118, చిత్తూరు అర్బన్ 89, చిత్తూరు రూరల్ 66, మదనపల్లె 112, పీలేరు 62, పుంగనూరు పరిధిలో 247 కేసులు బుక్ చేశారు. ఇందులో విద్యుత్ అదనపు లోడ్ కేసులు 738 కేసులకు గాను క్రమబద్ధీకరణ రుసుం రూ.14.49 లక్షలు, చౌర్యం కేసులు 116కు గాను రూ.1.49 వేలు జరిమానాతో కలిపి మొత్తం 854 సర్వీసులపై కేసులు నమోదు చేసి రూ.15.98 లక్షలు చెల్లించాలని వినియోగదారులకు నోటీసులు ఇచ్చినట్లు ఎస్‌ఈ కృష్ణారెడ్డి వివరించారు.

స్పందించినా.. అక్కసే!



అర్జీదారుడి సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ లక్ష్మీ శ



ప్రజలకు సహాయకులుగా అర్జీలను రాస్తున్న వీఆర్‌ఓలు

- ప్రతిష్టాత్మకంగా 'స్పందన' అమలు
- గత రెండేళ్లలో వచ్చిన అర్జీలు 26,523
- పూర్తి స్థాయిలో పరిష్కరించినవి 26,483
- ఓర్వలేకే ఎల్లోమీడియా విషపు రాతలు

ఫ్యాక్ట్ చెక్

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తోంది. ప్రతి సోమవారం కలెక్టరేట్ వేదికగా చేపడుతున్న జిల్లా స్థాయి స్పందన విశేషంగా ఆదరణ పొందుతోంది. వేలాది మంది సమస్యలను తక్షణమే పరిష్కరిస్తోంది. అయితే ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందని ఓర్వలేక పచ్చపత్రికలు బురదజల్లేందుకు యత్నిస్తున్నాయి. స్పందనలో అర్జీలను పట్టించుకోవడం లేదని దుష్ప్రచారం చేస్తున్నాయి. అర్జీదారులకు కనీస వసతుల సమకూర్చడం లేదని విషం కక్కుతున్నాయి. ఇది వాస్తవ దూరమని సాక్షాత్తు అర్జీదారులే వ్యాఖ్యానిస్తున్నారు. ప్రతి సోమవారం జిల్లా స్థాయి అధికారులు స్పందనకు వస్తున్నారని, ఉదయం 10 నుంచి 1.30 గంటల వరకు అర్జీదారుల సమస్యలను సావధానంగా వింటూ పరిష్కారమార్గాలను చూపుతున్నారని వెల్లడిస్తున్నారు.

వందల సంఖ్యలో వినతులు

స్పందనకు వచ్చే అర్జీదారులకు జిల్లా యంత్రాంగం అన్ని సౌకర్యాలను కల్పిస్తోంది. గ్రామీణ ప్రాంతం నుంచే వచ్చే వారికోసం అర్జీలు రాసేందుకు ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఓలను ఏర్పాటు చేసింది. అలాగే అర్జీదారుల కోసం కుర్చీలు, మంచినీరు, మరుగుదొడ్లు, బస్సు సౌకర్యం కల్పిస్తోంది. ప్రతి అర్జీకీ సమస్య తెలియజేసిన తేదీ నుంచి గడువు లోపు పరిష్కరించే విధంగా రసీదులను అందజేస్తోంది. అర్జీదారులకు వారం రోజులలోపు సంబంధిత శాఖాధికారులు మెసేజ్‌లు పంపుతున్నారు. ఫలానా గడువులోపు సమస్య పరిష్కారమవుతుందనే సమాచారాన్ని అందిస్తున్నారు. నూతన జిల్లా ఏర్పడినప్పటి నుంచి జిల్లావ్యాప్తంగా చేపట్టిన స్పందన కార్యక్రమాల ద్వారా వచ్చిన అర్జీలు మొత్తం 26,523 వచ్చాయి. వాటిలో ఇప్పటి వరకు 26,483 వినతులను పరిష్కరించారు. కేవలం 40 అర్జీలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో కూడా ప్రధానంగా వ్యక్తిగత సమస్యలు, కోర్టు కేసులకు సంబంధించినవి కావడంతో ఆలస్యమైందని అధికారులు తెలియజేస్తున్నారు.

జిల్లాలో శాఖల వారీగా స్పందన వినతుల వివరాలు

రెవెన్యూ	:	9,930
పంచాయతీరాజ్	:	2,923
పోలీసు శాఖ	:	2,027
మున్సిపాలిటీ	:	1,634
విద్యుత్ శాఖ	:	1,584
హౌసింగ్	:	1,258
సర్వే విభాగం	:	830
సివిల్ సప్లయ్	:	679
సచివాలయాల పరిధిలో	:	545
ఆరోగ్యశ్రీ	:	461
నీటిసరఫరా	:	413
గ్రామీణాభివృద్ధి	:	306
వ్యవసాయశాఖ	:	254
పశుసంవర్ధకశాఖ	:	213
స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్	:	200
రోడ్లు భవనాలు	:	187
ఇతర శాఖలకు	:	3,079
మొత్తం అర్జీలు	:	26,523
పరిష్కరించినవి	:	26,483
పెండింగ్‌లో ఉన్నవి	:	40

వంద శాతం పోలియో చుక్కలు వేయాలి



అధికారులతో కలసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జి.లక్ష్మీశ

- మార్చి 3వ తేదీన పల్స్‌పోలియో
- చుక్కలు వేసిన తర్వాత సమస్యలు ఉంటే పరిష్కారం
- జిల్లాలో 5 ఏళ్లలోపు పిల్లలు 2,53,282 మందికి గానూ 3,36,860 డోసుల కేటాయింపు
- సమీక్షలో కలెక్టర్ లక్ష్మీ శ

తిరుపతి అర్బన్: మార్చి 3వ తేదీన 5 ఏళ్లలోపు పిల్లలకు వందశాతం పోలియో చుక్కలు వేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జాతీయ పోలియో కార్యక్రమానికి సంబంధించి జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య, విద్య, స్త్రీశిశు సంక్షేమ శాఖల అధికారులు సమన్వయం చేసుకుని 0–5 సంవత్సరాలలోపు పిల్లలకు వందశాతం పల్స్ పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. జిల్లాలో 0–5 ఏళ్లలోపు 2,53,282 మంది పిల్లలకు 3,36,860 డోసులు వచ్చినట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 1824 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. అర్బన్ ప్రాంతాల్లో 427, రూరల్‌లో 1397 కేంద్రాలు, 83 మొబైల్ వాహనాలు, 185 రూట్లు, 59 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 7774 మంది సిబ్బందిని కేటాయించినట్లు చెప్పారు. ప్రతి పల్స్ పోలియో కేంద్రంలో నలుగురు చొప్పున సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో జన సంచారం ఎక్కువగా ఉండే చోట, ప్రధానంగా బస్టాండ్, రైల్వే స్టేషన్, మాల్స్ దగ్గర, కార్మికులు పని చేసే ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మార్చి 3వ తేదీన పోలియో చుక్కలు వేసిన తరువాత 4, 5 తేదీల్లో కూడా తప్పిపోయిన వారికి వేయాలని సూచించారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు పోలియో కార్యక్రమాన్ని ముందే ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. 5 ఏళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పకుండా వేయించాలని స్పష్టం చేశారు. మార్చి 2వ తేదీన మరోసారి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా పల్స్ పోలియో చుక్కలకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, డీఈఓ వి.శేఖర్, స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీ జయలక్ష్మి, డీఐఓ శ్రీనివాసుల తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని రైతు మృతి

కేవీబీపురం: కారు ఢీకొన్న ఘటనలో రైతు మృతి చెందిన ఘటన కేవీబీపురం మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ లోకనాథం తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పోలినాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన రైతు హరి(43) తన పొలానికి నీరు కట్టేందుకు బుధవారం సాయంత్రం బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో వెనుకవైపు నుంచి వేగంగా వచ్చిన సుమో ఢీకొనడంతో రైతు అక్కడికక్కడే ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కారు డ్రైవర్ మద్యం సేవించి ఉన్నట్లు సమాచారం. రైతుకు భార్య అనూషతో పాటు పిల్లలు అమృతవర్షిని,(13), నిఖిల్(17) ఉన్నారు.



మృతి చెందిన రైతు హరి(ఫైల్)

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం

– చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికలు, వాల్‌పోస్టర్లను బుధవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ముందుగా వేదపండితులు ఆహ్వాన పత్రికలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా చైర్మన్ అంజూ రు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ వచ్చే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మార్చి 3 నుంచి 16వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తామన్నారు. అంకు రార్పణ మొదలుపెట్టి 16వ తేదీ ఏకాంతసేవ వర కు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. అనంతరం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కి ఆయన ఆహ్వాన పత్రిక, స్వామి, అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈఓ నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులు మున్నారాయల్, బుల్లెట్ జయశ్యామ్, కొండూరు సునీత, రమాప్రభ, లక్ష్మి, సుమతి, ప్రత్యేక ఆహ్వానితులు చింతామణి పాండు,అధికారులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ నాగేశ్వరరావు



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న చైర్మన్, ఈఓ

8న మహాశివరాత్రి వేడుకలు..

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 8వ తేదీన మహాశివరాత్రి జరగనుంది. 12 రోజుల పాటు జరిగే ఈ వేడుకలు 3వ తేదీన ప్రారంభం అవుతాయి. 3న కన్నప్ప ధ్వజారోహణం, 4న స్వామివారి ధ్వజారోహణం, 8న మహాశివరాత్రి, 9న ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం, 10 స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, 11న సభాపతి కల్యాణం, 12న కైలాసగిరి ప్రదక్షిణ, 13న ధ్వజావరోహణం, 14న పల్లకీసేవ, 15న ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. 16న శాంతిఅభిషేకం నిర్వహించనున్నారు.

సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ ప్రతిభ



పి.భార్గవి



ఎ.భాస్కర్



వి.చంద్రమౌళి



కె.శశిధర్

తిరుపతి ఎడ్యుకేషన్: కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ (సీఎంఏ) ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు తిరుపతిలోని ఎమరాల్డ్స్ విద్యాసంస్థ డైరెక్టర్లు ఈ.గిరిధర్, కె.విశ్వనాథ ఒక ప్రకటనలో తెలిపారు. పి.భార్గవి 485, ఎ.భాస్కర్ 458, వి.చంద్రమౌళి 440, కె.శశిధర్ 414 మార్కులు సాధించినట్లు తెలిపారు. వీరితో పాటు పరీక్షకు హాజరైన విద్యార్థుల్లో 58.67 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

జిల్లాలో రీపోలింగ్‌కు ఆస్కారం ఉండకూడదు

తిరుపతి క్రైం: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్ పోలీసు అధికారులను ఆదేశించారు. బుధ వారం స్థానిక పద్మావతీ మహిళా వర్సిటీలో పోలీసు అధికారులకు ఎన్నికల విధులపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రానున్న మూడు నెలలు చాలా కీలకమని, సార్వత్రిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రతి అధికారి పనిచేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియను శాంతియుతంగా విజయవంతం చేయడమే మన లక్ష్యమన్నారు. గత ఎన్నికల్లో రీపోలింగ్ జరిగిన కేంద్రాలపై, సమస్యాత్మక కేంద్రాలపైన ప్రత్యేక దృష్టి పెట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌పై నిఘా ఉంచి వారు పరివర్తన చెందకపోతే పీడీ యాక్ట్ ప్రయోగించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల చెక్ పోస్టుల వద్ద క్రియాశీలకంగా వ్యవహరించాలని, అక్రమ రవాణాపై ఉక్కుపా దం మోపి, మద్యం, నగదును సీజ్ చేయాలని ఆదేశించారు. సీజ్ చేసే సమయంలో వీడియోతో పాటు పంచనామా చేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభ పెట్టే వారిని ముందుగా గుర్తించాలన్నారు. సెక్టోరల్ పోలీస్ అధికారులు ఎన్నికల కమిషన్ హ్యాండ్ బుక్‌ను క్షుణ్ణంగా చదవాలన్నా రు. తమ పరిధిలో లైసెన్స్ ఉన్న ఆయుధాలను వెంటనే యజమానుల నుంచి తీసుకుని డిపా జిట్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, విమల కుమారి, శివరామిరెడ్డి, ట్రైనీ ఐ పీఎస్ దేవరాజ్ మనీష్‌పాటిల్, డీఎస్పీలు, సెక్టోరల్ పోలీసు అధికారులు, రైటర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ మల్లికా గర్

సత్యవేడు అభివృద్ధే అజెండాగా పని చేద్దాం



వరదయ్యపాళెం: సమావేశంలో ప్రసంగిస్తున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి

- నూకతోటి రాజేష్ సారథ్యంలో సత్యవేడులో వైఎస్సార్‌సీపీ గెలుపుజెండా ఎగరేద్దాం
- వరదయ్యపాళెం సమన్వయ సమావేశంలో ఎంపీ గురుమూర్తి

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తాను, నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పనిచేస్తామని, అందుకు వచ్చే ఎన్నికల్లో సత్యవేడులో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, ప్రజాప్రతినిధులు పని చేయాలని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన నూకతోటి రాజేష్‌తో కలసి ఆయన వరదయ్యపాళెంలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పార్టీ శ్రేణుల సమన్వయ సమావేశంలో ఎంపీ ముందుగా నూతనంగా నియమితులైన సమన్వయకర్త నూకతోటి రాజేష్‌ను పార్టీ శ్రేణులకు పరిచయం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరగనున్నాయని తెలిపారు. అందువల్ల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా పని చేయాలన్నారు. ఇప్పటికే ఎంపీ నిధుల ద్వారా సత్యవేడు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఒక్క సత్యవేడు నియోజకవర్గంలోనే 86 వేల కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.2 వేల కోట్ల లబ్ధి ప్రస్తుత ప్రభుత్వంలో చేకూరిందన్నారు. పారిశ్రామికంగా రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న సత్యవేడు నియోజకవర్గం చెన్నై–విశాఖపట్నం, చెన్నై–బెంగళూరు కారిడార్లలో కీలకం అవుతుందన్నారు. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో మరికొన్ని కీలక పరిశ్రమలు ఈ ప్రాంత శ్రీసిటీకి రానున్నట్లు తెలిపారు.

నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..

నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ మాట్లాడుతూ తనను నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించిన సీఎం జగనన్నకు, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు అన్నారు. అలాగే పార్టీ తనపై పెట్టుకున్న నమ్మకానికి అనుగుణంగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో తాడిపత్రి నియోజకవర్గ పరిశీలకుడు బీరేంద్రవర్మ, మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, సింగిల్‌విండో చైర్మన్ హరిబాబురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, జిల్లా కార్యవర్గ సభ్యుడు బందిల సురేష్, నాగలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ పద్మనాభం, బీఎన్‌కండ్రిగ ఎస్సీ సెల్ కన్వీనర్ గురవయ్య, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పాల సుబ్రమణ్యం రెడ్డి, ప్రచార కమిటీ కన్వీనర్ చిలమత్తూరు భాస్కర్ రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు గుర్తు తెలియని వృద్ధుల మృతి

నాయుడుపేటటౌన్: మండల పరిధిలో రెండు చోట్ల జరిగిన రైలు ప్రమాదాల్లో ఇద్దరు గుర్తు తెలియని వృద్ధులు మృతి చెందినట్లు సూళ్లూరుపేట జీఆర్‌పీ ఎస్‌ఐ కొండప్ప నాయుడు బుధవారం తెలిపారు. మండల పరిధిలోని జువ్వలపాళెం గ్రామ సమీపంలో రైలు పట్టాల వద్ద మంగళవారం సాయంత్రం చెన్నై నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు బలవన్మరణం చెందినట్లు చెప్పారు. అలాగే నాయుడుపేట రైల్వే యార్డు సమీపంలో మంగళవారం రాత్రి 11.30 ప్రాంతంలో మరో గుర్తు తెలియని వృద్ధుడు గూడ్స్ రైలు కింద పడి మృతి చెందినట్లు ఆయన తెలిపారు. వీరి వయసు సుమారు 65 ఏళ్లు ఉండొచ్చని, అందులో ఒకరు వంక పూత రంగులో ఫుల్‌హ్యాండ్ చొక్కా ధరించాడని, మరోవ్యక్తి పెద్ద అంచు కలిగిన తెల్లపంచె, ఆకుపచ్చ రంగులో ఉన్న లుంగీ ధరించాడని తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ చెప్పారు.



మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడు